# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 215 పేజీలు : 8 వెల : రూ.2/- ఆదివారం 30 ఆగస్టు 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే
# ఆందోళన

- తక్షణ సాయం అందించాలని మోడీకి లేఖ



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 29:** నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో మిగతా2లో...

## అరకు కాఫీకి ప్రపంచస్థాయి
# గుర్తింపు తీసుకొచ్చాం

- సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్
- మన ఆరోగ్యం ..మన ఫోన్‌లోనే
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే
- గిరిజన ప్రాంతాల్లో సెల్ టవర్ ద్వారా కనెక్టివిటీ పెంచుతాం
- గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే అందేలా చేస్తాం
- అరకు పర్యటనలో సీఎం చంద్రబాబు




**పాడేరు,మన జనప్రగతి ఆగస్టు 29:** ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామ రాజు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టాం. సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉంది. ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించాం. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ఈ ప్రభుత్వానిది. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్‌టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతాం. గిరిజనుల ప్రతి ఒక్క సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తాం. 3 నెలల్లో ఇక్కడ ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తాం. ఏ వైద్య పరీక్ష అయినా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. మిగతా2లో...

## ప్రధాని మరోమారు
# విదేశీ పర్యటన

ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌లలో పర్యటించనున్న మోడీ



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 29:** ప్రధాని నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధం అయ్యారు. రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మిగతా2లో...

## కూటమిది నరికే సంస్కృతి కాదు...
# నాటే సంస్కృతి

- భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత
- ప్రకృతి, ఆధ్యాత్మికతల అద్భుత సమ్మేళనం "అశ్వత్థ నారాయణ వివాహం"
- అరణ్యారామంలో రావి, వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు


2లో



## నేనే నమ్మకద్రోహినే అయితే జైలులో ఎలా ఉంటా..?

వైసిపి దుష్ప్రచారాలపై విజయసాయి మండిపాటు

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 29:** తాను ఏనాడూ నమ్మకద్రోహం పనులు చేయలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. తనపై నమ్మకద్రోహి అంటూ వైకాపా కోటరీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ఈమేరకు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. 'నేను నమ్మకద్రోహినే మిగతా2లో...

## 31 వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం

- నిర్వాసితుల కోసం రూ.4.07 కోట్ల నిధుల విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ఏపి ప్రభుత్వం


2లో

## అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోంది

- 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'
- క్రీడా దినోత్సవ ముగింపు సభలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి




**తిరుపతి,మన జనప్రగతి ఆగస్టు 29:** అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో మాట్లాడుతూ.. భారతదేశానికే ఆదర్శంగా అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు కానున్నాయని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించటంలో భాగంగా సీఎం చంద్రబాబు.. ప్రముఖుల అకాడమీలను ప్రోత్సహిస్తున్నారన్నారు. పీవీ సింధు, పు÷-లలెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖుల అకాడమీలకు ప్రభుత్వం నుంచి స్థల కేటాయించినట్లు చెప్పారు. అరకు నుంచి తిరుపతి వరకు, మిగతా2లో...

## వక్ఫ్ సంస్థల పురోగతిపై చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమీక్ష



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 29:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, వక్ఫ్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్ సంస్థల సందర్శనలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ అంశాలు, కొనసాగుతున్న వివిధ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఉన్న వక్ఫ్ సంస్థల సంఖ్య, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు ఇప్పటి వరకు సందర్శించిన సంస్థలు, సందర్శనలకు సంబంధించిన ఆధారాలు, ఇంకా సందర్శించాల్సిన సంస్థలు, వాటిని మిగతా2లో...



## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

- తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే ఛాన్స్

**విశాఖపట్టణం,మన జనప్రగతి ఆగస్టు 29:** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని.. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం మిగతా2లో...

# అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం.. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది' అని సీఎం తెలిపారు. గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా.. ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా.. శెభాష్ అన్న ముఖ్యమంత్రి.. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు.. ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. అందరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా సంజీవని వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కనెక్టివిటీ పెంచేందుకు కూడా మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు భారం కాదని.. పిల్లలే మన సంపద అని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందాలని సూచించారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. కొండ ప్రాంతాల్లోని వారికి వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదనేది తన సంకల్పమని ఉద్ఘాటించారు. దీని కోసమే సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంజీవని కార్యక్రమం రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని ఉద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను పెద్ద ఆస్పత్రికి డ్రోన్ల ద్వారా తరలించి పరీక్ష చేసి చికిత్స అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు వైద్యసేవలందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. 104 వాహనాల ద్వారా సంచార వాహనాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. గిరిజనులతో పాటు రాష్ట్రంలో ప్రతీ పౌరుడి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్- 3 మేమే తీసుకువచ్చాం. గత పాలకులు నిర్లక్ష్యంతో సుప్రీంకోర్టు దానిని రద్దు చేసింది. ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తాం. ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశాం. అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశాం. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోం స్టేల ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుంది. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో 150 వాహనాలతో ఎమ్బ్యులెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉంది. కొండ ఎంత దూరంలో ఉన్నా... వైద్యం మీ దగ్గరకు రావాలి. మంచి వైద్యం అందాలి. ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి.. అందుకే సంజీవని తీసుకువచ్చాం. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి. గిరిజన ప్రాంతాలకు మంచి వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ తెస్తున్నాం. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్నాం. గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే ఎఐఐ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నాం. ఎఐఐ, జెఇఇ వంటి పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నాం. గిరిజన రైతులు తమ ఉత్పత్తితో ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. భారత్ 'విక్షిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్-2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్ లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్ కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాం పై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ అక్షలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

## కూటమిది నరికే సంస్కృతి కాదు... నాటే సంస్కృతి

**మంగళగిరి,మన జనప్రగతి ఆగస్టు 29:** ప్రకృతి సంరక్షణలో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదెల నాగబాబు అన్నారు. హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో సాంప్రదాయ రావి, వేప మొక్కల నాటే కార్యక్రమంలో నాగబాబు, సతీమణి పద్మజ కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రావి, వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మీడియాతో మాట్లాడుతూ "భూమాత మనకు పరోక్షంగా జన్మనిచ్చిన తల్లి. మనం పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు అవసరమైన ఆహారం, నీరు, గాలి, నివాసం వంటి ఎన్నో వనరులను భూమాత నుంచే పొందుతున్నాం. మన తల్లిదండ్రులు మనకు పెట్టే ప్రతి ఆహారపు ముద్ద కూడా భూమాత ప్రసాదించినదే. అలాంటి భూమాతకు తిరిగి మనం ఏమి చేస్తున్నాం అని ప్రతి ఒక్కరు ఆలోచించాలి. అడవులను నరికి వేయడం, విచక్షణారహితంగా మైనింగ్ చేయడం, ప్రకృతిని కాలుష్యం చేయడం ద్వారా మనమే భూమాతను గాయపరుస్తున్నాం. భూమాతను కాపాడటం మన బాధ్యత మాత్రమే కాదు, మన కర్తవ్యం అన్నారు. ప్రకృతి పరిరక్షణకు... అశ్వత్థ నారాయణ వివాహంభారతీయ సంప్రదాయంలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన అశ్వత్థ నారాయణ వివాహం సంప్రదాయం ప్రకృతి, ఆధ్యాత్మికత, సామరస్యానికి ప్రతీక. రావి, వేప చెట్లను ఒకే గుంతలో నాటే ఈ సంప్రదాయంలో రావి చెట్టును విష్ణుమూర్తికి, వేప చెట్టును లక్ష్మీదేవికి ప్రతీకలుగా భావించడం మన సంస్కృతిలో ప్రకృతికి ఇచ్చిన విశిష్ట స్థానం. రావి, వేప చెట్లు కలిసి పెరగడం ద్వారా పచ్చని పరిసరాల ఏర్పాటుకు, స్వచ్ఛమైన వాతావరణానికి, జీవ వైవిధ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుంది. ఈ చెట్లు దాదాపు 250 జీవరాశులకు ఆవాసంగా మారి, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆ ఆలోచనే మమ్మల్ని కలిపింది ఏదైనా మంచి పని మొదలుపెట్టే ముందు మొక్క నాటడం నా అలవాటు. ప్రకృతిని ప్రేమించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కళ్యాణ్ కి, నాకూ ఒకే రకమైన ఆలోచనలు ఉన్నాయి. గత ప్రభుత్వంలోని వారికి చెట్లను నరకడమే తప్ప, నాటాలనే ఆలోచనే వాళ్లకు రాలేదు. ఏ కార్యక్రమం చేసినా అడ్డువచ్చిన చెట్లను నరుక్కుంటూ పోయారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం కెన్యా వంటి దేశాలే అడవులకు, వన్యప్రాణులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయి. మరి జ్ఞానానికి పురిటిగడ్డ అయిన మన భారతదేశం, పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అరణ్యారామం డిజైన్లు పరిశీలించిన నాగబాబు** రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం 24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు.

ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు నాగబాబు కి వివరించారు. అలాగే తాడేపల్లి పరిధిలోని అటవీ ప్రాంత వివరాలను తెలియజేశారు.

# 31 వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం

**- నిర్వాసితుల కోసం రూ.4.07 కోట్ల నిధుల విడుదల**

**- ఉత్తర్వులు జారీ చేసిన ఎపి ప్రభుత్వం**

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 29:** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఈ నెల 31న జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను వారి పునరావాస కాలనీలకు స్వచ్ఛందంగా తరలించేందుకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.4.07 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా పశువుల దాణా, నిత్యావసర సరుకులు, మహిళలకు ప్రత్యేక కిట్లను అందించనుంది. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని 10 గ్రామాలకు చెందిన నిర్వాసిత కుటుంబాల వద్ద ఉన్న పశువులకు 30 రోజుల పాటు దాణా అందించనున్నారు. మొత్తం 4,933 పశువులకు దాణా అందించేందుకు రూ.65.8 లక్షలు కేటాయించారు. ఇందుకోసం మొత్తం 295.98 మెట్రిక్ టన్నుల దాణా అవసరమని అధికారులు అంచనా వేశారు. నిర్వాసిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించేందుకు ప్రభుత్వం రూ.2.81 కోట్లు కేటాయించింది. మొత్తం 10,000 మందికి నిత్యావసర సరుకుల కిట్లను అందించనున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.2,818గా నిర్ణయించారు. ఈ కిట్‌లో 25 కిలోల బియ్యం, కిలో పప్పు, కిలో చక్కెర, లీటర్ వంటనూనె, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళాదుంపలు ఉంటాయి. నిర్వాసితులు కొత్త ఇళ్లలోకి ప్రవేశించే సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా కిట్లను అందించనున్నారు. మొత్తం 6,000 కిట్లు పంపిణీ చేయనున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.1,000గా ఉంటుంది. ఇందులో చీర, గాజులు, పసుపు, కుంకుమ ఉంటాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.60 లక్షలు కేటాయించింది. పశువుల దాణా, నిత్యావసర సరుకుల కిట్లు, మహిళలకు ప్రత్యేక కిట్ల కోసం కలిపి ప్రభుత్వం మొత్తం రూ.4.068 కోట్లు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను వారి పునరావాస కాలనీలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా తరలించేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నిర్వాసితులకు పరిహారం కింద ప్రభుత్వం రూ.768 కోట్లు అందించినట్లు అధికారులు తెలిపారు.

# నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.

# నేనే నమ్మకద్రోహినే అయితే జైలులో ఎలా ఉంటా..?

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకునేవాడిని. సీబీఐ, ఈడీ ఛార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. నమ్మకస్తుణ్ని అనే కారణంతో ప్రతి ఛార్జిషీట్‌లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నా పేరు చేర్చింది. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే నన్ను 15 నెలలు కారాగారంలో ఉంచారు. నాకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లోనూ ఏ-5గా చేర్చారు. కాకినాడ సీపోర్టు కేసులో ఏ2గా చేర్చారు. సకల శాఖల మంత్రి పేరు మాత్రం ఇంతవరకు ఏ ఛార్జిషీట్‌లోనూ లేదు. ఏ కేసులూ లేకుండా ఎలానో కోటరీ నాయకుడికి తెలిసినంత నాకు తెలియదు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఉత్తరాంధ్ర నేతతో కలిసి కోటరీ నాయకుడు కుట్ర పన్నారు. నాపై అసత్యాలు చెప్పి ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించారు. జగన్ మెప్పు కోసమే నాస్తికుడిగా చెప్పుకొన్న ఆయన వైకాపాకే కాదు.. రాష్ట్రానికే నమ్మకద్రోహి. నా ఆత్మగౌరవానికి 2020 నుంచి భంగం కలిగించిందెవరు? 2019 ఎన్నికల విజయం తర్వాత సజ్జల ప్రమేయం ఎలా శృతిమించింది? జగన్‌ను ఎవరూ కలవకుండా గోడ కట్టింది సజ్జల కాదా? అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

# వక్ఫ్ సంస్థల పురోగతిపై చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. అలాగే, వివిధ విభాగాల పనితీరు, సమస్యలు, సవాళ్లు, పెండింగ్ అంశాలపై సంబంధిత విభాగాధిపతులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను సూచించారు.వక్ఫ్ ఆస్తుల క్షేత్రస్థాయి సమాచార సేకరణ, రికార్డుల ధృవీకరణ, డిజిటలైజేషన్ కోసం రూపొందించిన "ప్రాజెక్ట్ అమానహ్" పై చైర్మన్ ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రతి వక్ఫ్ ఆస్తికి ప్రత్యేక ఐడీ కేటాయించి, ఆస్తి వివరాలు, భౌతిక స్థితి, ఫోటోలు, ఆక్రమణలు, న్యాయపరమైన అంశాలు, రికార్డుల వ్యత్యాసాలు తదితర సమాచారాన్ని ఆధారాలతో సేకరించి, ధృవీకరించిన డిజిటల్ రికార్డుగా రూపొందించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ముందు 7 రోజుల పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించనున్నారు. ఇందులో ఫీల్డ్ డేటా సేకరణ, ఫారమ్ వినియోగం, డేటా నాణ్యత, రిస్క్ గుర్తింపు, యాక్షన్ ట్రాకింగ్, జిల్లా స్థాయి డ్యాష్‌బోర్డ్ వంటి అంశాలను పరీక్షించి, అవసరమైన సవరణలు చేసిన అనంతరం ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని చైర్మన్ సిబ్బందికి సూచించారు. ప్రతి విభాగం సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ యాఖూబ్ ఖాజీ, డీఈఈ అబ్దుల్ ఖాదర్, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, సెక్షన్ హెడ్‌లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోంది

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో ప్రపంచంలో ఏ ఈవెంట్ జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక క్రీడాకారుడైనా పాల్గొనాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని చెప్పుకొచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం(ధ్యాన్‌చంద్ జయంతి), తెలుగు భాషా దినోత్సవం(గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి) తిరుపతి వేదికగా క్రీడాకారులకు మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలియ జేశారు. రాబోయే 50 ఏళ్లకు సరిపడా అత్యుత్తమ క్రీడా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని 3 జోన్లుగా(వైజాగ్, అమరావతి, తిరుపతి) విభజన చేసినట్లు తెలిపారు. క్రీడా పరికరాల తయారీ కోసం నెల్లూరు పరిసరాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తిరుపతిలో కేటాయించిన స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆడిటోరియాలు, క్రీడా ప్రాంగణాల నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు పాఠశాలల గ్రౌండ్లను సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రతిభను వెలికితీసేలా కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేశారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొన్నది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామిశ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం వైభవంగా



దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 29:- దేవనకొండ మండలం వెలంకూరు గ్రామంలో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి శ్రీదేవి, భూదేవిలతో కల్యాణోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కోరిన కోరికలు తీర్చే స్వామిగా, సంతాన వరప్రదాతగా శ్రీ వెంకటేశ్వర స్వామివారికి విశేషమైన భక్తి విశ్వాసాలు ఉన్నాయి. దీంతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దేవనకొండ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, పోలీస్ సిబ్బందితో పాటు వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# సంక్షేమ వసతి గృహాల్లో డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయాలి

### - విద్యార్థులపై నిరంతరం నిఘా..

### పకడ్బందీ చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 29:-జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సంక్షేమ వసతి గృహాలు, ఈగల్ టీమ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులపై నిరంతరం నిఘా ఉంచాలని, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, కేసుల నమోదుపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాలపై గట్టి నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని చిప్పగిరి, పెద్దహరివాణం, హాలహర్వి, ఆలూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రహస్యంగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం ఉందని, వాస్తవంగా సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే కేసులు నమోదు చేసి అరికట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మిని ఆదేశించారు.సంక్షేమ వసతి గృహాల్లో సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదని, విద్యార్థులకు పౌష్టికాహారం, తాగునీరు అందించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో నీటి వసతి, మెష్‌లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. అవసరమైతే వసతి గృహాలపై థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. అవసరమైన సౌకర్యాలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డీఈఓ సుధాకర్, ఎస్ఎస్ఏ పీఓ లోకరాజు, ఆర్ఐఓ లాలెప్ప, జిల్లా ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు రాధిక, ప్రసూన, డీవీవీ సురేష్‌బాబు, రెసిడెన్షియల్ స్కూల్స్ కోఆర్డినేటర్ పుష్పరాజ్, మైనారిటీ సంక్షేమ అధికారిణి సబిహా పర్వీన్, జ్యోతిబా పూలే విద్యాలయ జూనియర్ లెక్చరర్ యమునాదేవి, లీగల్ టీమ్ ఎస్సై రమేష్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.


# ఏపీ పోలీసు స్పోర్ట్స్ మీట్‌కు కర్నూలు రేంజ్ క్రీడాకారుల సన్నద్ధత

### • పోలీసు అధికారులు,సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లు

### అందజేసిన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్ట్ 29:-ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్ గుంటూరు లో ( సెప్టెంబర్ 1 తేదీ నుండి సెప్టెంబర్ 3 వరకు ) మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో కర్నూలు రేంజ్ నుంచి పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డీఐజీ పోలీసు క్రీడాకారులను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి కర్నూలు రేంజ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని డీఐజీ తెలిపారు.ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు రేంజ్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐలు చంద్రబాబు నాయుడు, తేజామూర్తి, తిక్కస్వామి, ఆర్ఐలు, ఎస్ఐలు, స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రావణ శనివారం సందర్భంగా వృషభాలేశ్వర స్వామి, గండి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



వేంపల్లి మన జనప్రగతి ఆగస్టు 29:- శ్రావణ మాసంలోని పవిత్ర శ్రావణ శనివారం సందర్భంగా వేంపల్లిలోని శ్రీ వృషభాలేశ్వర స్వామి ఆలయం, గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాల్లో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి, తుంగభద్ర హైలెవల్ కెనాల్ ప్రాజెక్ట్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయాలకు చేరుకున్న వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 29:- బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని,గృహనిర్మాణం,విద్యా రుణాలు, ఎంఎస్ఎంఈ,వ్యవసాయ మౌలిక వసతులు,వ్యవసాయ అనుబంధ రంగాల్లో రుణాల లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో బ్యాంకర్లకు సంబంధించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రుణాల విషయంలో బ్యాంకులు మరింత చొరవ చూపాలన్నారు.అర్హులైన విద్యార్థులకు సకాలంలో రుణాలు అందించాలని కలెక్టర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ రంగంలో సాధన కేవలం 12.45 శాతం మాత్రమే ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి లక్ష్యాలను మెరుగుపరచాలన్నారు. వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన రంగంలో కూడా రుణాల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ పేర్కొంటూ, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు.వ్యవసాయ అనుబంధ రంగాల్లో లోన్లకు సంబంధించి అధిక లక్ష్యాలు ఉన్నప్పటికీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 49 శాతం లక్ష్యాలను సాధించారని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంకులు లక్ష్య సాధనలో మరింత చొరవ చూపి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో వచ్చే త్రైమాసికంలో మెరుగైన పురోగతి సాధించాలన్నారు.జిల్లా ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో ఎంఎస్ఎంఈ రంగం కీలక పాత్ర పోషిస్తుందని, అందువల్ల జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల పంపిణీలో బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్య సాధనలో మెరుగైన పనితీరు కనబరుస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇతర బ్యాంకులు కూడా ఎస్‌బీఐ అనుసరిస్తున్న విధానాలు, కార్యాచరణ ప్రణాళికలను అధ్యయనం చేసి లక్ష్య సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్య సాధనలో కేవలం 11 శాతం ప్రగతిలో ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబర్ చివరి నాటికి కనీసం 50 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. రైతులు గత కొంతకాలంగా సాగునీటి సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి పశుపోషణ మంచి ప్రత్యామ్నాయ జీవనోపాధిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన రైతులు, లబ్ధిదారులకు పశు పోషణ యూనిట్ల కోసం ఎక్కువ సంఖ్యలో రుణాలు మంజూరు చేసి రైతులకు అండగా నిలవాలన్నారు.. పశుసంవర్ధక యూనిట్లకు బీమా ఎంతో ముఖ్యమని, ప్రతి యూనిట్‌కు బీమా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రవీంద్రబాబు, కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.మోహన్, నాబార్డ్ డిడియం ఎం.సుబ్బారెడ్డి, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, కెనరా బ్యాంక్ ఆర్సెటి డైరెక్టర్ పుష్ప కుమార్, కేడిసిసి బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కర్నూలు అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని సబిహ పర్వీన్, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు , డిఆర్డిఏ పిడి శ్రీధర్, మెప్మా పిడి శ్రీనివాసులు, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# గండి వీరాంజనేయ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

### మూడో శ్రావణ శనివారం 6 వేల మందికి అన్నప్రసాదం

### ప్రత్యేక పూజలు, పటిష్ట ఏర్పాట్లు







చక్రాయపేట/పులివెందుల మన జనప్రగతి ఆగస్టు 29:- పవిత్ర శ్రావణమాసం సందర్భంగా గండి శ్రీ వీరాంజనేయ స్వామి క్షేత్రం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. శ్రావణమాసంలోని మూడో శనివారం స్వామివారిని దర్శించుకుంటే శుభం కలుగుతుందనే దృఢమైన విశ్వాసంతో కడప జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో గండి క్షేత్రానికి తరలివచ్చారు.మూడో శ్రావణ శనివారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల కోసం ఉదయం 4.30 గంటల నుంచే స్వామివారి దర్శన సౌకర్యాన్ని కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఆధ్వర్యం లో క్యూ లైన్ల వద్ద తాగునీటి సౌకర్యం, ఉచిత అన్నప్ర సాదం వంటి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సుమారు 6,000 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించింది.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన వైద్య సేవలను అందించారు. అలాగేగండి వీరాంజనేయ స్వామివారిని దర్శించుకునేందుకు మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవీంద్రారెడ్డి), ఆయన సోదరులు జోగిరెడ్డి, భారత్ రెడ్డి తదితరులు విచ్చేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అదేవిధంగాశాశ్వత నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందించారు.పెద్దివీడు, రాయచోటికి చెందిన నారాయణజయమ్మ దంపతులు రూ.50,000 స్కానర్ ద్వారా విరాళంగా అందించారు.అన్నమయ్య జిల్లాకు చెందిన రామపాటి శ్రీనివాసులుజ్యోతి దంపతులు రూ.30,000 నగదు రూపంలో అందించారు. యర్రగుంట్లకు చెందిన ప్రసాద్ రెడ్డిమాధవి దంపతులు అన్నదానం పీఓఎస్ ద్వారా రూ.25,000 విరాళం అందించారు.స్వామివారి హుండీ, ప్రసాదాల ఆదాయంమూడో శ్రావణ శనివారం సందర్భంగా స్వామివారి దేవస్థానానికి వివిధ మార్గాల ద్వారా గణనీయమైన ఆదాయం సమకూరింది.అర్జిత సేవ టికెట్ల ద్వారా: రూ.3,61, 186లడ్డూ ప్రసాదం ద్వారా: రూ.9,04,500పులిహోర ప్రసాదం ద్వారా: రూ.73,000ప్రత్యేక దర్శనం ద్వారా: రూ.2,48,520 తాత్కాలిక హుండీల ద్వారా: రూ.6,86,311తాత్కాలిక షాపుల ద్వారా: రూ.21,490శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సందడితో కళకళలాడాయి.

స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఆశా కార్యకర్తపై గ్రామస్తుల ఫిర్యాదు

### • పనితీరు మెరుగుపరుచుకునేందుకు నెల రోజుల గడువు: డీఎంహెచ్‌ఓ యుగంధర్



పులివెందుల రూరల్ మన జనప్రగతి ఆగస్ట్ 29 :- పులివెందుల నియోజక వర్గ పరిధిలోని వేంపల్లి మండలం అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త పనితీరుపై గ్రామస్తులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. పులివెందుల మండలం కొత్తపల్లిలో డీఎంహెచ్‌ఓను కలిసి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు.గతంలో ఆశా కార్యకర్త పనితీరుపై నిర్వహించిన విచారణ నివేదికను పక్కనపెట్టి అధికారులు ఆమెను కాపాడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషణ కమిటీ సమావేశంలో ఆమె పనితీరుపై చేసిన తీర్మానాన్ని కూడా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.ఆశా కార్యకర్త కుటుంబ సభ్యులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను కోరారు.ఈ విషయంపై డీఎంహెచ్‌ఓ యుగంధర్ మీడియాతో మాట్లాడుతూ ఆశా కార్యకర్త పనితీరుపై ఫిర్యాదులు అందిన విషయం వాస్తవమేనని తెలిపారు. ఆమెకు పనితీరు మెరుగుపరుచుకునేందుకు ఒక నెల రోజుల సమయం ఇచ్చామని, ఆ వ్యవధిలో పనితీరులో మార్పు కనిపించకపోతే నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసిన వారిలో అయ్యవారిపల్లెకు చెందిన భూమిరెడ్డి విజయభారతి, రమణారెడ్డి, ప్రసాద్, రామసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

మన జనప్రగతి

30- 08 - 2026

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఘన స్వాగతం



**చిత్తూరు మన జనప్రగతి ఆగస్టు 29:**-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా,యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి చిత్తూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం చిత్తూరు పట్టణంలోని టీడీపీ నాయకుడు సీకే బాబు నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీకే బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి పూల బొకేలు అందజేసి, పూలమాలలు వేసి,శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి చిత్తూరు పర్యటన సందర్భంగా సీకే బాబు నివాసం వద్ద టీడీపీ శ్రేణులు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

## పారుపాకలోని ఆ స్థలంలో పశువుల బోను నిర్మించాలి



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 29:**-రౌతులపూడి మండలం పారుపాక గ్రామంలో ప్రభుత్వ స్థలంలో అందరికీ ఉపయోగపడే పశువుల బోను నిర్మాణం చేయాలని ఆ గ్రామస్తులు శనివారం కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఎటువంటి గ్రామసభ సమావేశం ఏర్పాటు చేయకుండా ప్రత్యేక అధికారి,పంచాయతీ కార్యదర్శి, ఎంపిడివోలు ఆ స్థలంలో రామాలయం కట్టేందుకు, ఒకే కులానికి తీర్మానం ఇచ్చారన్నారు. వివాదంగా ఉన్న ఈ స్థలంలో పోలీసులు దగ్గరుండి ఆ స్థలంలో నిర్మాణానికి పనులు చేయించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పక్కుర్తి జీవ జయబాబు, గుంటబోయిన చిట్టిబాబు, చలమాల బాబులు, కొల్లు వరహాల బాబు, గుంటబోయిన శివ, యు అర్జునుడులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా రామాలయం పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. తాము ఏ ఒక్క కుల, మతానికి వ్యతిరేకం కాదని చెప్పారు. ఆ స్థలాన్ని అందరి కుటుంబాలకు ఉపయోగపడే పశువుల బోను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ నిర్మాణాన్ని ఆపివేసి అందరికీ ఉపయోగ పడే పశువుల బోను ఏర్పాటు చేయాలని గత ఐదు నెలల నుంచి జిల్లా కలెక్టర్, ఎండిఓలకు వినతి పత్రాలను అందించినట్లు వారు పేర్కొన్నారు.

## కారు - బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 29:**-కడపచెన్నై జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్ధవటం మండలం కనుమలోపల్లి సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కోడూరు నుంచి ఆరుగురు కారులో కడప సమీపంలోని పాలకొండ్రాయుడు స్వామి దర్శనానికి వెళ్తుండగా, డ్రైవర్ గిరిబాబు అతివేగంగా కారు నడుపుతూ ఎదురుగా ఎలక్ట్రిషన్ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కడపకు చెందిన వెంకట కార్తీక్, సయ్యద్ వల్లి అనే ఇద్దరిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికీ బలమైన గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, సిద్ధవటం ఎస్సై హారిక, హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

## రక్తదానంతో ప్రాణదాతలుగా నిలిచిన ప్రొద్దుటూరు పోలీసులు..!






**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 29:**భారతదేశ మాజీ ఉప ప్రధాని,ఉక్కు మనిషి స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారి విభు కృష్ణ ఐపీఎస్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రొద్దుటూరు ఏఎస్పీ విభు కృష్ణ ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు.ఆయనతో పాటు వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి, ట్రాఫిక్ సీఐ భాస్కర్, వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, టూటౌన్ ఎస్ఐ రాఘవేంద్ర రెడ్డి, రాజుపాలెం ఎస్ఐ ప్రణయ్ కుమార్ రెడ్డితో పాటు ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌కు చెందిన 27 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విభు కృష్ణ మాట్లాడుతూ.. రక్తం అందుబాటులో లేక అనేక మంది రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ముఖ్యంగా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి తరచూ రక్తం అవసరమవుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన వ్యక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు.రక్తదానం చేయడం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభిస్తుంది. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరు ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి రక్తం అవసరమైన రోగులకు బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన రోటరీ క్లబ్ సభ్యులకు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి, అలాగే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియా ప్రతినిధులకు ఏఎస్పీ విభు కృష్ణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో కార్యక్రమం ఆదర్శప్రాయంగా నిలిచింది.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు




**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 29:**-జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్, ఎన్.సీ.సీ మరియు క్రీడా విభాగాల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పురుష, మహిళా విద్యార్థులకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించి క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.వాలీబాల్, క్రికెట్, మ్యూజికల్ చైర్స్, రింగ్‌బాల్ తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఎన్.సీ.సీ కోఆర్డినేటర్ బి. కిరణ్‌కుమార్,ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్లు యు. ప్రసాద్, ఖాజా వోయిస్ ఖీర్నీ, ఫిజికల్ డైరెక్టర్ జబ్బిఉల్లా సమన్వయంతో నిర్వహించారు ఈ కార్యక్రమానికి కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోపవరం వ్యవసాయ పొలాల్లో రైతుల బోర్ల వైయర్లు చోరీ

**- వ్యవసాయ పొలాలకు సాగునీరు అందక రైతుల ఇబ్బందులు**



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 29:** చెన్నూరు మండలం శివాల పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోపవరం గ్రామం పరిధిలో రైతులు సాగునీటి కోసం భూమిలో బోర్లు వేగా శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోపవరం గ్రామానికి చెందిన కే సుబ్బరాయుడు యాదవ్ కు చెందిన రెండు వ్యవసాయ బోర్లకు సంబంధించి 15 మీటర్లు వరకు డబల్ వైర్లు కత్తిరించుకొని వెళ్లారు, శనివారం ఉదయం 6 గంటలకు విద్యుత్ వస్తుందన్న ఆశతో ఇంటి నుంచి బోర్ల దగ్గరికి వెళ్లిన రైతులకు వైర్లు కనిపించకపోవడంతో రైతులు కు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండిపోయారు,గోపవరం గ్రామానికి చెందిన పాడి రైతులు వ్యవసాయ పొలాల్లో గడ్డి సాగు చేసుకుంటూ పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు, గుర్తు తెలియని దొంగలు ఓయర్లు చోరీ చేయడంతో రైతుల పరిస్థితి మునిగేనక్కపై తాటికాయపడినట్టు తయారైంది, ప్రస్తుతం కేసీ కెనాల్ కు నీరు అందక వర్షాలు పడకపోవడం బోర్ల ద్వారానైనా పశువులకు గడ్డి సాగు చేసుకుందామన్న ఆశతో బోర్లు ఏర్పాటు చేసుకోగా సాగునీటి బోర్ల వైర్లను దొంగలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మోటార్ల వయర్లు చోరీ గురి కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు,

## రేడియో స్టేషన్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస మహోత్సవాలు

**కడప మన జన ప్రగతి ఆగస్టు 27:-** కడప పులివెందుల ప్రధాన రహదారి లో చింతకొమ్మదిన్నె మండలం శివాజీ నగర్ రేడియో టేషన్ ప్రక్కన వెలసిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మూడో శనివారం శ్రావణమాస మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి, ఉదయం వేద పండితులచే అభిషేక పూజలు ప్రత్యేక పూల అలంకరణ నిర్వహించారు, ఉదయం 6 గంటల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సమీపంలో ఉన్న యోగివేమన విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ సిబ్బంది, కొప్పర్తి పారిశ్రామిక వాడ కార్మికులు స్వామివారి దర్శనం చేసుకున్నారు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ 2 గంటల వరకు నిర్వహించారు, వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ తీసుకున్నారు,

## ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరుకు ప్రజలంతా చేయూతనివ్వాలి

**● సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్**




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 29:** పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న "స్వచ్ఛ సంకల్ప దీక్ష" కార్యక్రమానికి ప్రజలంతా భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని,పర్యావరణానికి తీవ్ర హాని కలిగే అవకాశం ఉందని కమిషనర్ పేర్కొన్నారు. అంతేకాకుండా ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నివారించి, వాటికి బదులుగా క్లాత్ బ్యాగులు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు.పట్టణంలోని కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పర్యావరణహితమైన బ్యాగులను వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వినియోగదారులు కూడా వస్తువులు కొనుగోలు చేసే సమయంలో ప్లాస్టిక్ కవర్లు అడగకుండా, ఇంటి నుంచే క్లాత్ బ్యాగులు తీసుకెళ్లే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.ప్లాస్టిక్ నివారణ కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యార్థులు ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే ఆశించిన ఫలితాలను సాధించగలమని కమిషనర్ తెలిపారు. సిడిఎంఏ ఆధ్వర్యంలో రూపొందించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ అవగాహన పోస్టర్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన కోరారు. "సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ప్రొద్దుటూరుకు చేయూతనివ్వండి" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "మన ప్రొద్దుటూరు మన బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి పౌరుడు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పరిశుభ్రమైన, పచ్చని, ఆరోగ్యకరమైన ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు నిర్మాణంలో భాగస్వామి కావాలని కమిషనర్ కోరారు.

## సబ్ స్టేషన్‌ను సందర్శించిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 29:** స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర ద్వితీయ,తృతీయ సంవత్సర విద్యార్థినులు రచ్చుమరిపల్లె సమీపంలోని ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విద్యుత్ ఉపకేంద్రాన్ని (సబ్ స్టేషన్) శనివారం సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు అనుమతితో భౌతికశాస్త్ర అధ్యాపకులు ఎన్.బి.శివరామిరెడ్డి,డాక్టర్ ఓబుల్ రెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఈ విజ్ఞాన విహార/ప్రత్యక్ష క్షేత్ర సందర్శనను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ నాగమల్లేష్ విద్యార్థినులకు విద్యుత్ వ్యవస్థపై అవగాహన కల్పించారు.విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల (జనరేషన్ సెంటర్స్) నుండి సబ్ స్టేషన్ల వరకు ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ ఏ విధంగా సరఫరా అవుతుందో వివరించారు.అలాగే సబ్ స్టేషన్ పనితీరు,విద్యుత్ నియంత్రణ మరియు పంపిణీ వ్యవస్థల గురించి సమగ్రంగా తెలియజేశారు.తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చూడటం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును సులభంగా అర్థం చేసుకోగలిగామని విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.ఇటువంటి విద్యా సంబంధిత క్షేత్ర సందర్శనలు తమ భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు,విద్యార్థినులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేతతో కుప్పకూలిన రైతు ఆశలు

**- ఆక్సిజన్ అందక లక్షల విలువైన చేపలు మృతి...బాధిత రైతు ఆవేదన**



**కరప మన జనప్రగతి ఆగస్టు 29:**-విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా చేపల రైతు తీవ్రంగా నష్టపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. విద్యుత్ బిల్లులో సింహభాగం చెల్లించినప్పటికీ, అదనపు చార్జీలు బకాయి ఉన్నాయన్న కారణంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చెరువుల్లో ఆక్సిజన్ అందించే మోటార్లు పనిచేయక లక్షలాది రూపాయల విలువైన చేపలు మృత్యువాత పడ్డాయని బాధిత రైతు వనుం నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం. కరప మండలం వేములవాడ గ్రామంలోని ఐదు ఎకరాల చేపల చెరువులకు సంబంధించిన విద్యుత్ బిల్లులో ప్రధాన మొత్తాన్ని ఇప్పటికే చెల్లించామని, కేవలం అదనపు బిల్లు మాత్రమే బకాయి ఉందని తెలిపారు. తాను బయట ఉన్నానని ఆ మొత్తాన్ని కూడా రెండు రోజుల్లో చెల్లిస్తానని, అప్పటి వరకు కొంత సమయం ఇవ్వాలని స్థానిక విద్యుత్ సిబ్బందిని కోరినప్పటికీ స్పందించలేదని ఆరోపించారు.స్థానిక లైన్‌మెన్ విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో చెరువుల్లో ఆక్సిజన్ అందించే మోటార్లు ఆగిపోయాయని, దీంతో చేపలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయని నారాయణరావు తెలిపారు. పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే సంబంధిత విద్యుత్ ఏఈకి ఫోన్ చేసి విషయాన్ని వివరించానని, బిల్లు చెల్లిస్తానని, వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరినా సరైన స్పందన రాలేదని పేర్కొన్నారు. మోటార్లు పనిచేయక చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడంతో వేలాది చేపలు నీటిపైకి తేలి మృత్యువాత పడ్డాయని రైతు వాపోయారు. కళ్లముందే తాను అప్పులు చేసి, ఎంతో కష్టపడి పెంచిన చేపలు చనిపోవడం తీవ్రంగా కలచివేసిందని కన్నీటి పర్యంతమయ్యారు. కేవలం అదనపు బిల్లు బకాయి ఉందన్న కారణంతో విద్యుత్ సరఫరా నిలిపివేసి, పరిస్థితి తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంపై నారాయణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తనకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తనకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేసి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు నారాయణ రావు కోరారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
30- 08 - 2026

# భూముల పరిరక్షణకు దళిత రైతుల నిరాహార దీక్ష

- దీక్షలకు అనుమతివ్వాలని అధికారులకు వినతి



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 29:**-తమ భూముల పరిరక్షణకు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మాధవరం1 ఎస్‌కేఆర్ నగర్‌కు చెందిన దళిత రైతులు శనివారం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రైతుల వివరాల మేరకు.. 2013లో భూ అసైన్మెంట్ కమిటీ ద్వారా పెద్దపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 937లో 1147 నుంచి 1162 వరకు ఉన్న భూముల్లో 70 దళిత కుటుంబాలను హక్కుదారులుగా అధికారులు గుర్తించి ధ్రువీకరించారని తెలిపారు. అయితే ప్రస్తుతం కొంతమంది తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమస్యను పరిష్కరించి తమ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం నుంచి సిద్ధవటం రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. దీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తమ పోరాటానికి ప్రజలు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని దళిత రైతులు కోరారు.

# అంజన్న భక్తులకు అన్నదాతల సేవ..

- శ్రావణమాసం మూడో శనివారం ప్రత్యేక ఏర్పాట్లు
- పసుపులేటి బాబు ఆధ్వర్యంలో భోజన వితరణ



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 29:**-రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులకు అన్నదాతలు సేవలందించారు. శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా వేంపల్లె పట్టణంలోని కడప రోడ్డు హనుమాన్ జంక్షన్ వద్ద దాతల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గండి క్షేత్రం మాజీ పాలకమండలి సభ్యుడు పసుపులేటి బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమంలో గండి క్షేత్రానికి వెళ్లే భక్తులకు నిర్వాహకులు భోజనం వడ్డించారు. శ్రావణమాసం కావడంతో స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్తున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పసుపులేటి బాబు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా దాతల సహకారంతో ప్రతి శ్రావణమాసం మూడో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంజన్న భక్తులకు సేవ చేయడం ద్వారా ఎంతో ఆత్మసంతృప్తి లభిస్తోందన్నారు. ప్రతి ఏడాది అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏటీఎం ప్రసాద్, కిషోర్, పసుపులేటి గంగులయ్య, రామగంగాధర్ (చిన్నా), సుబ్బారెడ్డి, రామాంజనేయరెడ్డి, మల్లికార్జున, చరణ్, కోనేటి నారాయణ, టి. నారాయణ పాల్గొన్నారు.

# నేమకల్లు గ్రామ 8 మంది రైతులకు రూ.1.36 కోట్ల భూ పరిహారం

- చెక్కుల పంపిణీ చేసిన,ఎమ్మెల్యే ప్రభుత్వ కాలవ శ్రీనివాసులు



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 29:**-ఏపీఐఐసీ పార్కు ఏర్పాటుకు నేమకల్లు గ్రామానికి చెందిన రైతులు అందించిన 9.13 ఎకరాల భూమికి రాష్ట్ర ప్రభుత్వం 8 మంది రైతులకు రూ.1.36 కోట్ల భూ పరిహారం చెక్కులను ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చేతుల మీదుగా చెక్కులు అందజేశారు, ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,అభివృద్ధి కార్యక్రమాలకు భూములు అందిస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాలవ శ్రీనివాసులు తెలిపారు,రైతులకు న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు, ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ రఘు,మండల కన్వీనర్ కె.మల్లన్న,మాజీ సర్పంచ్ హనుమంతరాయ, బసప్ప,రైతులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి
- సీబీఆర్ రైట్ కెనాల్‌కు చిత్రావతి నీళ్లు




**పులివెందుల మన జనప్రగతి ఆగస్టు 29**:రైతుల సాగునీటి అవసరాలను తీర్చి పంటలను కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి స్పష్టం చేశారు.శనివారం పులివెందుల టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి సీబీఆర్ రైట్ కెనాల్‌కు నీటిని విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగునీటి కొరత రాకుండా రాబోయే పది రోజుల పాటు నిరంతరాయంగా నీటి సరఫరా కొనసాగుతుందని అందుబాటులో ఉన్న ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ చివరి ఆయకట్టు వరకు సమర్థవంతంగా సాగునీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు అని అన్నారు.సాగునీటి సరఫరాలో రైతులకు ఎలాంటి సమస్యలు,ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.రైతుల సంక్షేమం,సాగునీటి భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,రైతన్నలకు అన్ని విధాలా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు.

# నాగార్జున జ్ఞాపకార్థం నిరుపేద రోగులకు అల్పాహారం

- పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించిన కుటుంబ సభ్యులు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 29:**-సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామానికి చెందిన మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు కీ.శే. పాలూరు నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయన అన్నయ్య పాలూరు మల్లికార్జున ఆధ్వర్యంలో మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో శనివారం కడప నగరంలోని రిమ్స్ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిరుపేద రోగులు, యాచకులు, నిరాశ్రయులు 150 మందికి ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ.. నాగార్జున జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాగార్జున ఎక్కడ ఉన్నా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. పుట్టినరోజు, ఇతర ప్రత్యేక సందర్భాలను ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమాలకు వినియోగించి నిరుపేదలు, నిరాశ్రయులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగార్జున కుటుంబ సభ్యులు పాలూరు మల్లికార్జున, రేవంత్ కుమార్, సేవా సంస్థ సభ్యులు కానల ఈశ్వరయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మాధవి రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు




**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 29:**-కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవి రెడ్డి జన్మదినం సందర్భంగా మాధవరం-1 గ్రామానికి చెందిన యువత, చేనేత కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా మాధవి రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రావతి భావనారాయణ చేనేత సంఘం సొసైటీ చైర్మన్ జింకా శ్రీనివాసులు, మాజీ వార్డు సభ్యులు ఉక్కడాల శివ, టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా సుధీర్ రాయల్, డా. లక్ష్మీనారాయణ, జొన్నాదుల శ్రీనివాసులు, జింకా ఓబులేసు, బిట్టా రాజేంద్ర, మాజీ డీలర్ గొట్టిముక్కల సుబ్బరాయుడు, జానపాటి సుబ్బరాయుడు, జానపాటి సాయి తేజ, కత్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి: ఎమ్మెల్యే అరవ శ్రీధర్



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 29:**-రైల్వే కోడూరు నియోజకవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ అధిష్టానం సూచనలు, ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ కోరారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన ప్రణాళికను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, మండలంలో పార్టీ బలాబలాలను అంచనా వేసుకుని, స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సెప్టెంబర్ 2న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో జనసేన యువజన విభాగాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ అధిష్టానం ప్రకటించిందని తెలిపారు. యువత,మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ పార్టీ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, జనసేన పార్టీ బలాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో చాటేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కోరారు. పార్టీ అధిష్టానం ఏ బాధ్యత అప్పగించినా క్రమశిక్షణతో,సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేయాలని ఆయన నాయకులు, జనసైనికులకు సూచించారు.

# స్థానిక వ్యాపారాల బలోపేతంతోనే ప్రొద్దుటూరు ఆర్థిక ప్రగతి: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 29:**-పట్టణ ఆర్థికాభివృద్ధిలో స్థానిక వ్యాపారులు, వ్యాపార సంస్థల పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక వ్యాపారులకు ప్రజలు అండగా నిలవాలని మాత్రమే తాను కోరుతున్నానని, ఈ విషయంలో తాను టీడీపీ నేతలను విమర్శించలేదని రాచమల్లు స్పష్టం చేశారు. ప్రొద్దుటూరులోని వ్యాపారులు అభివృద్ధి చెందితే ఆర్థిక కార్యకలాపాలు పట్టణంలోనే కొనసాగుతాయని, తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణానికి పన్నులు, ఇతర రూపాల్లో ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థల ద్వారా వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం ఇతర ప్రాంతాలకు తరలిపోయే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అదే స్థానిక వ్యాపారాల ద్వారా వచ్చే ఆదాయం పట్టణ ఆర్థిక వ్యవస్థలోనే చలామణి అవుతుందని వివరించారు. అందువల్ల స్థానిక వ్యాపారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ప్రజలకు సూచించారు. తనపై ఇటీవల చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని రాచమల్లు సవాల్ చేశారు. రాజకీయంగా విమర్శలు చేసుకోవడంలో తప్పులేదని, అయితే ఆధారాలు లేకుండా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే ఏ అంశాన్నీ తాను వ్యతిరేకించబోనని, పట్టణ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.


# ఆర్భాటాలకు దూరంగా..సేవా కార్యక్రమంతో పుట్టినరోజు

- 80 మంది పేదలు, నిరాశ్రయులకు అన్నదానం



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 29:**-పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు దూరంగా నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సిద్ధవటం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నూకల శ్రీనివాసులు కుమార్తె నూకల శాన్వి శ్రీ పుట్టినరోజు సందర్భంగా లిఖిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఒంటిమిట్టలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్టలోని యాచకులు, అనాథలు, నిరాశ్రయులు 80 మందికి మధ్యాహ్న భోజనాన్ని ప్యాకెట్ల రూపంలో పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకను సామాజిక సేవకు ఉపయోగిస్తూ పేదలకు అన్నదానం చేయడం ద్వారా శాన్వి శ్రీ కుటుంబ సభ్యులు మానవతా విలువలను చాటారని పలువురు అభినందించారు. ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలకు వినియోగించడం ద్వారా సమాజంలో సేవా స్ఫూర్తి పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లిఖిత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రాటాల రామయ్య, నూకల వెంకట మోక్షజ్ఞ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రావణమాసం 3వ శనివారం కావడంతో ఆంజనేయ స్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 29:**- చెన్నూరు మండలం వ్యాప్తంగా శ్రావణమాసం మూడవ శనివారం కావడంతో వివిధ గ్రామాల్లో నెలకొల్పిన ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు, చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు అలంకరణ నిర్వహించారు, ఆలయం ప్రక్కన నిలువెత్తు ఆంజనేయ స్వామికి అలంకరణ నిర్వహించారు, పెన్నా నది ఒడ్డున శివాలయం ఎదురుగా నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి, చెన్నూరు సమీపంలో బుడ్డాయిపల్లి క్రాస్ రోడ్ వద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు అలంకరణ నిర్వహించారు, చెన్నూరు పెన్నా నది అవతల ఒడ్డున వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, రామనపల్లి కొండపేట కనుపర్తి వివిధ గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి, పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు నిర్వహించారు, పలు ఆలయాల్లో హనుమాన్ చాలీసా సంకీర్తన భజనలు నిర్వహించారు,

# ఘనంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి జన్మదిన వేడుకలు





**కడప మన జనప్రగతి ఆగస్టు 29:**-నగరంలోని పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి జన్మదిన సందర్భంగా డాక్టర్ మధుసూదన్ రెడ్డి.కార్పొరేషన్ అధికారులు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్లకు పట్టణ ప్రజలకు ఉచిత మేఘ మెడికల్ క్యాంపును శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ని వారందరికీ సంవత్సరానికి రెండు లేదా మూడుసార్లు ఉచిత మేఘ మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచిత మందులు కూడా ఇవ్వాలని వాటికి సంబంధిత డాక్టర్లను కోరారు.ప్రజలు కూడా కనబడని రోగాలు ఎన్నో ఉంటాయని ఇలాంటి క్యాంపులలో పరీక్ష చేసుకొని సరైన వైద్యం చేసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని,కుటుంబం సంతోషంగా ఉంటుందని తెలిపారు. వచ్చిన పేదలందరికీ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్లు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో అనేక రోగాలకు సంబంధించిన పట్టణంలో పేరుగాంచిన వైద్యులందరితో శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలోమున్సిపల్ యూనియన్ నాయకులు,మున్సిపల్ సిబ్బంది ,కార్పొరేషన్ అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయి పేట లోని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాజు సుబ్బారెడ్డి .చిరంజీవి. యువ రాజ్ .ఆధ్వర్యంలో అన్నదానం. మహిళలకు చీరలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నార. నగరంలోని అన్నమయ్య విగ్రహం దగ్గర వెంకటసుబ్బయ్య .వల్లి. సిలాస్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు

# సప్తరాత్రోత్సవాల్లో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్.



**కర్నూలు బ్యూరో మంత్రాలయం మన జనప్రగతి ఆగష్టు 29:-** ఆగష్టు 27 నుండి సెప్టెంబర్ 2 వరకు కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్ర స్వామి 355 వ సప్తరాత్రోత్సవాలలో భాగంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ భద్రత ఏర్పాట్లను,ఆలయ పరిసరాలను శనివారం పరిశీలించారు. ఫాల్కన్ వాహనం ,డ్రోన్ కెమెరాలు,బాడీ ఒన్ కెమెరాలు,సిసి కెమెరాల వంటి తదితర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దాదాపు 300 మంది పోలీసు బలగాలతో ఉత్సవాలలో భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేశామన్నారు.అనంతరం శ్రీమఠంలో క్యూ లైన్,దేవాలయ ప్రాకారం,తుంగ భద్ర నది తీర పరిసర ప్రాంతాలను పరిశీలించారు.సప్తరాత్రోత్సవాల ఏర్పాట్ల గురించి మఠం సహాయ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి జిల్లా ఎస్పీకి వివరించారు.జిల్లా ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు,మంత్రాలయం సిఐ దస్తగిరి,సీఐ రామంజులు, శ్రీ మఠం అధికారులు ఉన్నారు.

# అభయాంజనేయ స్వామికి శ్రావణ శనివార ప్రత్యేక పూజలు

**- కోతి సమాధి వద్ద శ్రావణ శోభ,పోటెత్తిన భక్తజనం**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగష్టు 29:**పులివెందుల పట్టణ పరిధిలోని కోతి సమాధి వద్ద గల అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడుతూ శ్రావణ శోభ సంతరించుకుంది.తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు,విశేష ఆకుపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి,మహా మంగళహారతి సమర్పించారు.అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.పూజా కార్యక్రమాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు నిర్వహించిన హనుమాన్ భజనలు,సంకీర్తనలు భక్తిభావాన్ని నింపాయి. పూజానంతరం భక్తులందరికీ అన్నదాన వితరణ చేపట్టారు.పవిత్రమైన శ్రావణ మాసంలో స్వామివారిని ఆరాధించడం,అన్నదానం చేయడం వల్ల విశేష పుణ్యఫలాలు లభిస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు.ఈ కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన ఉభయదాతలకు స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు,స్థానిక ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడాభివృద్ధికి రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజిస్తాం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి








**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగష్టు 29:-**రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. క్రీడాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించనున్నట్లు వెల్లడి ంచారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎస్వీయూ ఆడిటోరియంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకలకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి క్రీడాకారులను అభినందించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, 26 జిల్లాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-17, అండర్-23 విభాగాల్లో 12 క్రీడాంశాల్లో 2.07 లక్షల మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలు, రన్నర్లను ప్రోత్సహించేందుకు రూ.91.90 లక్షల ప్రైజ్‌మనీ అందించినట్లు మంత్రి తెలిపారు.రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. నెల్లూరు పరిసరాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతి ఛాంపియన్‌షిప్ కార్యక్రమానికి ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు లభించడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు.

# కరెన్సీ నోట్లతో వడ్డీ కాసుల స్వామి దర్శనం

**• రూ.3.15 లక్షల నగదుతో అలంకరణ**




**వేంపల్లె మన జనప్రగతి ఆగష్టు 29:-**స్థానిక నాలుగు రోడ్ల కూడలి లోని ఆలయంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామిని కరెన్సీ నోట్లతో చూడ చక్కని రూపంగా అలంకరించారు. శ్రావణ మూడో శనివారాన్ని పురస్కరించుకొని భక్తుల సహకారంతో ఆలయ అర్చకుడు తిరుమల వేణు స్వామివారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్వామివారికి భక్తులు సమర్పించిన రూ 10,20, 50, 100,200, 500 నోట్లతో అత్యంత కళాత్మకంగా స్వామి విగ్రహానికి పట్టు పంచె కట్టు రూపాన్ని, సుందర హారాలను, మకర తోరణాన్ని అలంకరణలను తీర్చిదిద్దారు. ఇందుకు గాను రూ 3.15 లక్షల మొత్తాన్ని వినియోగించారు. స్వామివారి దివ్య మంగళ స్వరూపంపై నోట్ల మాలలు, శోభాయమానమైన అలంకారాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో సుభాష్ ఆలయ కమిటీ చైర్మన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

# డైట్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవం




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగష్టు 29: -**రాయచోటి డైట్‌లో శనివారం ఉదయం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ, అభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి, భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి తెలుగు భాషా వికాసానికి చేసిన కృషిని, ధ్యాన్‌చంద్ భారత క్రీడా రంగానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. తెలుగు భాషను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత; క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యం, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయి” అని వక్తలు పేర్కొన్నారు.అనంతరం తెలుగు భాష పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఛాత్రోపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు మహమ్మద్ ఇలియాస్ అహ్మద్, గిరిబాబు యాదవ్, శివప్రసాద్, కేదార్‌నాథ్ తదితరులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.


# శిక్షణ పొందిన మధ్యవర్తులతో సమావేశం మధ్యవర్తులకు ధృవపత్రాల పంపిణీ




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగష్టు 29:-**కర్నూలులోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు ఆధ్వర్యంలో మధ్యవర్తుల శిక్షణా కార్యక్రమం పూర్తి చేసిన మధ్యవర్తులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జి. కబర్ధి, గౌరవనీయ ప్రధాన జిల్లా న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, అలాగే బి. లీలా వెంకట శేషాద్రి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన జిల్లా న్యాయమూర్తి మరియు డిఎల్ఎస్ఎ ఛైర్మన్ జి. కబర్ధి గారు, డిఎల్ఎస్ఎ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మిడియేషన్ 3.0” కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను మధ్యవర్తులకు వివరించారు. పక్షాల మధ్య తలెత్తే వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా, మధ్యవర్తులు తమ నైపుణ్యాలను సమర్థవంతంగా వినియోగించి, ఇరుపక్షాలకు మెరుగైన మరియు నిష్పక్షపాతమైన మధ్యవర్తిత్వ సేవలను అందించాలని కోరారు. అనంతరం, శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన శిక్షణ పొందిన మధ్యవర్తులకు గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి జారీ చేసిన పాల్గొనిన ధృవపత్రాలను గౌరవ అతిథులు అందజేశారు.

# శ్రావణ శనివారం వేడుకలు

**- ఆంజనేయస్వామికి విశేష పంచామృతాభిషేకాలు, ఆకుపూజ**



**సింహాద్రిపురం మన జనప్రగతి ఆగష్టు 29:**సింహాద్రిపురం గ్రామంలోని అతి పురాతన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస శనివారాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో వేకువజాము నుంచే పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి.స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన,అష్టోత్తర శతనామావళి,విశేష ఆకుపూజలు జరిపించారు.అనంతరం భక్తులకు స్వామివారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు,నిర్వాహకులు మాట్లాడుతూ శ్రావణ మాసంలో వచ్చే ప్రతి శనివారం,మంగళవారాల్లో భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,గ్రామ ప్రముఖులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


## రామన్నపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు,క్రీడా దినోత్సవాలు



**చెన్నూరు మన జనప్రగతి ఆగష్టు 29:-**చెన్నూరు మండలం రామన్నపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు గణేష్‌బాబు, తెలుగు ఉపాధ్యాయులు బాబయ్య, మహేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దుర్గ, సుశీలతో పాటు కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అలాగే భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడారంగానికి అందించిన సేవలు, ఆయన క్రీడా ప్రతిభను విద్యార్థులకు తెలియజేశారు.గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్‌లను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని తమ రంగాల్లో ప్రతిభను చాటుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి ప్రత్యేక పూజలు

**- శ్రావణ శనివారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసిన పూజారి నాగరాజ శర్మ**



**తొండూరు మన జనప్రగతి ఆగష్టు 29:-** మండల పరిధిలోని తొండూరు పాటిమీద వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి వారికి శ్రావణమాసం మూడవ శనివారం కావడంతో పూజారి నాగరాజశర్మ స్వామివారిని ప్రత్యేక అలంకరణలతో పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆంజనేయ స్వామి అభిషేక పూజలు ప్రత్యేక పూల అలంకరణ నిర్వహించారు, ఉదయం 6 గంటల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది

# వ్యాసరచన పోటీలో సత్తా చాటిన అగడూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



**తొండూరు మన జనప్రగతి ఆగష్టు 29:-**తెలుగు భాషా ఉన్నతి, పరిరక్షణకు విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి స్మారకార్థం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాజంపేట కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తొండూరు మండలం అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో అగడూరు పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు బి. డీలవేణి, సి. హాసిని, డి. అశ్విని, డి. జశ్విత ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ఈ విషయాన్ని కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎస్. కళాంజలి తెలిపారు.తెలుగు భాష గొప్పతనం, తెలుగు భాష పరిరక్షణ, నా మాతృభాష తెలుగు పట్ల అభిమానం, తెలుగు సాహిత్యంసంస్కృతి తదితర అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థినులు విలువలతో కూడిన చక్కటి వ్యాసాలను రచించి న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారని నిర్వాహకులు తెలిపారు.విద్యార్థినులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాల విద్యార్థినులు వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
30- 08 - 2026

# నీట్‌పీజీ పరీక్షకు భారీ బందోబస్తు

● నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ● జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హెచ్చరిక



**మదనపల్లె మన జనప్రగతి ఆగస్టు 29:–**ఈ నెల 30న ఆదివారం నిర్వహించనున్న నీట్‌పీజీ పరీక్షకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మదనపల్లెలోని మిట్స్, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలు, రాయచోటిలోని శ్రీ సాయి, భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 8.30 గంటల తర్వాత కేంద్రాల్లోకి అనుమతించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 నుంచి 300 మీటర్ల పరిధిలో భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ పరిధిలోని జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా అనుమతించబోమన్నారు. పరీక్షకు సంబంధించి పేపర్ లీక్ వదంతులు సృష్టించడం, ప్రచారం చేయడం లేదా ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# చేతివృత్తిదారులకు న్యాయం చేయాలి...

# పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 29:–**చేతివృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేతివృత్తిదారుల సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పత్తికొండలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దయ్య ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పెద్దయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చేతివృత్తిదారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, వారికి ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని చేతివృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రజకులు, నాయీ బ్రాహ్మణులు, గొర్రెల కాపరులకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేయడంతో పాటు చేతివృత్తిదారుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమైక్య తుగ్గలి మండల కార్యదర్శి మద్దిలేటి, రజక సంఘం మండల అధ్యక్షుడు వీరేష్, సీపీఐ జిల్లా నాయకుడు మద్దిలేటి శెట్టి, సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి దూదేకొండ ఎంపీటీసీ పెద్ద ఈరన్న, జోహరాపురం కాశీ, పట్టణ రామాంజనేయులు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టికంటయ్య, గుండు భాష, ఉపేంద్ర, సిద్ధు, మాదన్న, పూజారి లక్ష్మన్న తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో చేతివృత్తిదారులు పాల్గొన్నారు.

# ముగిసిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

● పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి: డైరెక్టర్ ఎన్.దీక్షిత్ ఆకాంక్ష.




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 29:–**విద్యార్థులు పట్టుదలతో సాధన చేసి లక్ష్యాన్ని చేదించాలని శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ డైరెక్టర్ ఎన్ దీక్షిత్ అన్నారు.శనివారంజిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియం లో ఏర్పాటుచేసిన జాతీయ క్రీడా దినోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.విద్యార్థులు తక్కువ చదువుతారు, ఉపాధ్యాయులు చెబితే వింటారు, వారికి మార్కులు తక్కువ వచ్చిన వ్యవస్థపై పట్టు సాధిస్తారు అన్నారు. అందుకే చదువుతోపాటు క్రీడల సాధన అవసరమని విద్యార్థులకు సూచించారు. క్రీడా దినోత్సవ పోటీల్లో కర్నూలు నంద్యాల జిల్లా లకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొనడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. శారీరక శ్రమగల క్రీడల సాధన చేస్తే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందుతారని ఆయన సూచించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బొల్లవరం రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము నిర్వహించే ఇటువంటి పోటీలకు సహకరిస్తున్న వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం విజేతలైన ఆయా విద్యా సంస్థల విద్యార్థులకు కప్పులు మెడల్స్ బహూకరించి అభినందించారు.కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ సుధీర్ ప్రవీణ్ కొండపోగు సుంకన్న గుడిపల్లి సురేందర్, తదితరులు వ్యాయామ ఉపాధ్యాయులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో టీడీపీ నాయకులు



**సుండుపల్లి మన జనప్రగతి ఆగస్టు 29:–** సుండుపల్లి మండలం మాచిరెడ్డిగారిపల్లి గ్రామపంచాయతీలోని చిన్నబిడికి గ్రామంలో శ్రీరామ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ మహా సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు హాజరయ్యారు. గ్రామస్తులు వారికి బాణసంచా కాల్చి, పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు టీడీపీ నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేరింగుల సిద్దులయ్య, ప్రధాన కార్యదర్శి బి. గోపాల్ నాయక్, వైస్ చైర్మన్ చీకు నాయక్, సీనియర్ సివిల్ జడ్జి శ్యామసుందర్, కౌన్సిలర్ విష్ణువర్ధన్ నాయక్, ఎస్వీ యూనివర్సిటీ సీఈ రామ్లు నాయక్, హైకోర్టు డీఎస్ఓ మాధురి, ఎమ్మార్వో వేణుగోపాల్, జేసీ బాలు నాయక్, ఎంపీపీ రాజమ్మ, కాంచన రెడ్డన్న, పాముల ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు, చిన్నబిడికి గ్రామస్తులు, మాచిరెడ్డిగారిపల్లి గ్రామపంచాయతీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కడప డీఈఓ కార్యాలయంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

● ఐదు పాఠశాలలకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం




**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 29:–**కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శనివారం సాయంత్రం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. మొదటి స్థానంలో మున్సిపల్ హైస్కూల్, గాంధీనగర్ తరపున ప్రధానోపాధ్యాయురాలు వెంకలక్ష్మి, రెండో స్థానంలో జడ్పీహెచ్ఎస్ నలుపురెడ్డిపల్లె తరపున గోవర్ధన్‌రెడ్డి, మూడో స్థానంలో జడ్పీహెచ్ఎస్ రామనపల్లి తరపున పోలంకి గణేష్‌బాబు, నాలుగో స్థానంలో కేజీబీవీ అట్లూరు తరపున ప్రమీల, ఐదో స్థానంలో జడ్పీహెచ్ఎస్ వి.కొత్తలూరు తరపున శ్రీకాంత్‌రెడ్డి పురస్కారాలను అందుకున్నారు.ఈ పురస్కారాలను డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, సైన్స్ అధికారి రెహమాన్ ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తున్నందుకు ఈ అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో క్రీడా స్థలాన్ని ఎంపిక చేసి విద్యార్థులు ప్రతిరోజూ వ్యాయామం, క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. చిన్న వయసు నుంచే క్రీడల్లో శిక్షణ పొందితే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదిగి ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఈఎఫ్ సెక్రటరీ చంద్రావతి, రాష్ట్ర ఏపీపీఈటీ, పీడీ అసోసియేషన్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు ఫిజికల్ డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమపై రైతులకు అవగాహన

- మేరా రేశం మేరా అభిమాన్2 సదస్సు నిర్వహణ




**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 29:–**పత్తికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో మేరా రేశం మేరా అభిమాన్2 కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పట్టు పరిశ్రమపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త డాక్టర్ వసంత వీరస్వామి, ఏఎస్ఓ సి.ఎస్. విజయకుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిని రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టు పరిశ్రమలో రైతులకు మంచి ఆదాయ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పట్టు గూళ్లకు సుమారు రూ.700 వరకు ధర లభిస్తోందని పేర్కొన్నారు. ఏడాదిలో పది పంటలు తీసుకునే అవకాశం ఉన్న పంటగా పట్టు పరిశ్రమను వివరించారు. రైతులకు అందుబాటులో ఉన్న సబ్సిడీలు, షెడ్ల నిర్మాణం, మల్బరీ మొక్కల సబ్సిడీ తదితర అంశాలను వివరించారు.సంప్రదాయ పంటలతో పాటు రైతులు కొత్త పంటల సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ఒకసారి మల్బరీ తోటను ఏర్పాటు చేసుకుంటే 10 నుంచి 15 సంవత్సరాల వరకు సాగు చేసుకోవచ్చని తెలిపారు. తక్కువ వ్యయంతో నిర్మించుకునే షెడ్ల గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు.పట్టు పరిశ్రమకు సంబంధించిన ఈ అవకాశం గ్రామానికి రావడం సంతోషకరమని, రైతులంతా ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని పట్టు పరిశ్రమను ప్రారంభించాలని టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిని రాజశేఖర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు.కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు శివతేజ, నితీష్, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ బర్త్‌డే వేడుకలను నిర్వహించేందుకు జనసేన సన్నాహాలు

**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 29:–**ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు రైల్వేకోడూరులో జనసేన నాయకులు భారీగా సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు రాష్ట్రంలోనే రైల్వేకోడూరు ప్రత్యేకంగా వేదికగా నిలుస్తోంది. ఈసారి కూడా కన్నుల పండుగగా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పర్యవేక్షణలో వేడుకల నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా ఆహ్వాన కమిటీ సభ్యులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, మాజీ సర్పంచ్ కారుమంచి సంయుక్త, తాతంశెట్టి తులసి చిట్వేలి మండల నాయకులతో కలిసి ఆహ్వాన సంచికను ఆవిష్కరించారు.పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. మండలం లోని ఎన్డీఏ నాయకులను స్వయంగా కలిసి సాదరంగా ఆహ్వానించాలని ఆహ్వాన కమిటీ సభ్యులు నిర్ణయించారు. జనసేన అధినేత జన్మదిన వేడుకలో పార్టీ శ్రేణుల ఐక్యతను చాటేలా, అభిమానులకు చిరస్మరణీయంగా నిలిచేలా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, మద్దూరి మన్మథ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుపాకుల పెంచలయ్య, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వృషభాచలేశ్వర స్వామి అలంకరణ మాలల కోసం రాచనేని సోదరుల విరాళం





**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 29:–**వృష బాచలేశ్వర స్వామి దీవించయ్యా అంటూ వేంపల్లి భక్త జనం ముక్తకంఠంతో వేడుకున్నారు. శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకొని అర్చకుడు హరి ప్రవీణ్ నేతృత్వంలో స్వామిని బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక మాలల తో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఎద్దుల కొండపై స్వామివారికి ఈ నాలుగు శనివారాల ప్రత్యేక అలంకరణల కోసం బెంగళూరు నుంచి తెప్పించిన మాలలకు వేంపల్లి మాజీ సర్పంచ్ రాచినేని శ్రీను, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణులు రూ70 వేలు విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చిన మాజీ సర్పంచ్ ఆర్ శీను ను ఆలయ కమిటీ చైర్మన్ పివి రమణ ఈఓ సుబాస్ లు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

# ఘనంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి జన్మదిన వేడుకలు




**కడప మన జనప్రగతి ఆగస్టు 29:–**కడప నగరంలోని సాయిపేటలో కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాలంపల్లి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టీడీపీ జోనల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మాధవి రెడ్డి కేక్ కట్ చేసి వారితో ఆనందంగా గడిపారు.అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి రెడ్డి, శ్రీనివాసరెడ్డి ప్రజలకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్‌కుమార్, ఓబులేష్, నరేష్‌కుమార్, బొమ్మిచెట్టు చంద్ర, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: కడప ఎస్పీ



**కడప,మన జనప్రగతి ఆగస్టు 29: –** జాతీయ సమైక్యత మాసోత్సవాల్లో భాగంగా కడపలోని ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపంలో పోలీసు సిబ్బంది కోసం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని అన్నారు. శిబిరంలో ఈసీజీ, 2డీ ఎకో, కంటి పరీక్షలు, బీపీ, బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించారు. కిమ్స్ కార్డియాలజిస్ట్ డా. నగేష్, పల్మనాలజిస్ట్ డా. శ్రీనివాసులు రెడ్డి తదితరులు వైద్య సేవలందించారు.అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కూడా ఎస్పీ ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. డీటీసీలో శిక్షణ పొందుతున్న 20 మంది ట్రైనీ కానిస్టేబుళ్లతో పాటు పలువురు సిబ్బంది రక్తదానం చేశారు.కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, పోలీస్ యూనిట్ డాక్టర్ రేష్మా, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వాడుక భాషకు పట్టం గట్టిన చిచ్చరపిడుగు 'గిడుగు'

## సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి



**కడప మన జనప్రగతి ఆగస్టు 29:-**గ్రాంథికభాష తెలుగునాట రాజ్యమేలుతున్న రోజుల్లో వాడుకభాషకు పట్టం గట్టిన చిచ్చరపిడుగు గిడుగు వెంకట రామమూర్తి అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం శనివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో గిడుగు వేంకటరామమూర్తి పంతులు 164వ జయంతిని మరియు సి.పి.బ్రౌన్ ఊహాచిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం 104వ జయంతిని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి,సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్,తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమ్యజ్యోతి, విశ్రాంత బ్యాంకు అధికారి ఎం.ఎస్.దామోదర గుప్త, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి గిడుగు వెంకట రామమూర్తి, మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు.ఆ తర్వాత సంచాలకులు ఆచార్య గంజి పార్వతి మాట్లాడుతూ ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో జె.ఎ.ఏట్స్ అనే ఆంగ్లేయ పాఠశాలల అధికారి పుస్తకాలలో ఉన్న తెలుగుకు,వాడుకలో ఉన్న తెలుగుకు గల వ్యత్యాసాన్ని గుర్తించి, గిడుగు రామమూర్తితో చర్చించి ఆయనలో వ్యావహారిక భాషావాదానికి సంబంధించిన ఆలోచనను రేకెత్తించారన్నారు.గిడుగు చేపట్టిన వ్యావహారిక భాషా ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. సంగీతం,సాహిత్యం,

నాట్యం, చిత్రలేఖనం అనే నాలుగు లలితకళల్లో ప్రావీణ్యం కలిగి లలితకళానిధిగా కొనియాడబడుతున్న మైనంపాటి కుంచె పట్టి, భారతి పత్రికలో లభించిన బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ ఛాయాచిత్రం ఆధారంగా సంవత్సరం పాటు శ్రమించి బ్రౌన్ ఊహాచిత్రాన్ని ఆయన సాహిత్యకృషిని వెల్లడిచేస్తూ తాళపత్ర గ్రంథ అధ్యయన నేపథ్యంతో చిత్రించారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి గిడుగు వెంకట రామమూర్తి మూలపురుషుడన్నారు. ఆయన బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది అని అన్నారు. మైనంపాటి కృషి బహుముఖీనమైందని, లలిత కళలన్నింటిలో ఆరితేరిన ఆయన పద్యం, వచనం, గేయం, నాటకం, నాటిక, కథ, వ్యాసం మొదలైన ప్రక్రియల్లో 35కు పైగా రచనలు చేశారన్నారు.పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమ్యజ్యోతి మాట్లాడుతూ గిడుగుకు తాను నివసించే పర్లాకిమిడి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగిందన్నారు. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నారన్నారు.సవరభాషలో పుస్తకాలు రాసి, సొంతడబ్బుతో బళ్ళు పెట్టి, అధ్యాపకుల జీతాలు చెల్లించి, సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారన్నారు. విశ్రాంత తెలుగు పండితులుఎస్.సుబ్బరాయుడు మాట్లాడుతూ గిడుగు విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలియజేశారు.ఒడిషా రాష్ట్రం ఏర్పడే సమయంలో పర్లాకిమిడి రాజా తన పర్లాకిమిడి తాలూకా అంతటిని ఒడిషా రాష్ట్రంలో చేర్పించడానికి ప్రయత్నించినపుడు,తెలుగువారికి నాయకునిగా రామమూర్తి నిలిచి ప్రతిఘటించారన్నారు.తిరుపతికి చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎం.ఎస్.దామోదర గుప్త సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి రూ.10,000/- విరాళమిచ్చారు.ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేష్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

# లయోలా డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 29:** పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి అధ్యక్షత వహించగా అధ్యాపక బృందం,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని,ప్రాచీన వైభవాన్ని విద్యార్థులకు వివరించారు.వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు తెలుగు భాషా వికాసానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించి,దానిని భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేస్తూ తెలుగు ఔన్నత్యాన్ని చాటే పలు పద్యాలను స్వయంగా ఆలపించి అలరించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన"ఘననాయకాయ" ప్రార్థనా గీత నృత్యరూపకం మరియు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు హిమకుంట్ల లక్ష్మీనారాయణ,సంస్కృత విభాగాధిపతి డాక్టర్ జి.సాయి నరేంద్ర కుమార్ రెడ్డి,ఆంగ్ల విభాగం అధ్యాపకురాలు శ్రీమతి కల్యాణితో పాటు కళాశాల అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయం

**● ఎస్ వి విద్యా మందిర్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి.**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 29:** తెలుగు భాష అభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయం అని ఎస్ వి విద్యా మందిర్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి అన్నారు.రాయచోటి ఎస్ వి విద్యామందిర్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసే వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ..తెలుగు భాష అభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.అప్పట్లో ప్రజలకు కష్టంగా ఉన్న గ్రాంథిక భాషకు బదులుగా అందరికీ సులభంగా అర్థమయ్యే వ్యావహారిక భాషను ప్రోత్సహించేందుకు గిడుగు వెంకట రామమూర్తి విశేషంగా కృషి చేశారని తెలిపారు.తెలుగు భాష మన సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం, మన వ్యక్తిత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ తెలుగు భాషను ప్రేమించి, పరిరక్షించాలని డాక్టర్ సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. అదే సమయంలో ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషను కూడా నేర్చుకోవడం ఎంతో అవసరమని, అయితే ఇతర భాషలను నేర్చుకుంటూనే మాతృభాష తెలుగును గౌరవించి, ప్రేమించాలని విద్యార్థులకు సూచించారు.తెలుగు భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని తెలుగు భాష పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# వైద్య సేవల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ పి.యుగంధర్

**● ఎర్రబల్లి కొత్తపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్ ఆకస్మిక తనిఖీ**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 29:** వైఎస్సార్ జిల్లాలో ప్రజలకు మెరుగైన,నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందేలా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల పనితీరును మరింత బలోపేతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ పి.యుగంధర్ అధికారులను ఆదేశించారు.శనివారం నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ఎర్రబల్లి కొత్తపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా క్లినిక్‌లో అందుతున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్ ప్రక్రియ,రికార్డుల నిర్వహణ,మందుల నిల్వలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం టీకాలు వేయించుకుంటున్న గర్భిణులతో మాట్లాడి వారికి అందిస్తున్న టీకాల ప్రాధాన్యతను వివరించారు.ప్రతి ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఖచ్చితమైన సమయపాలన పాటించి ప్రజలకు అవసరమైన అత్యవసర మందులను ఎల్లప్పుడూ నిల్వ ఉంచాలన్నారు.గర్భిణుల నమోదు,ప్రసవ పూర్వఅనంతర పరీక్షలు,చిన్నారులకు వ్యాక్సినేషన్ ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా 100% లక్ష్యాలను సాధించాలనిక్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ,ఎర్రబల్లి కొత్తపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లాలోనే ఉత్తమ క్లినిక్‌గా తీర్చిదిద్దడానికి వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజా మొనిద్దీన్,డీపీఎంవో డాక్టర్ మహమ్మద్ తహా,డీపీవో నారాయణ,డాక్టర్ బాలాజీ,సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ప్రసాద్,సీనియర్ అసిస్టెంట్ నరేష్,హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాతృభాషకు సముచిత స్థానం: మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, మన జనప్రగతి ఆగస్టు 29:-** తెలుగు భాషా పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు 163వ జయంతి సందర్భంగా విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు-2026' అందజేశారు. పురస్కార గ్రహీతలకు రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషను ప్రజల్లోకి తీసుకువచ్చిన మహనీయుడని మంత్రి కొనియాడారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాల్సిన అవసరం ఉందని, తెలుగు భాషను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సహకరిస్తామని మంత్రి తెలిపారు. ఉగాది, కందుకూరి, తెలుగు భాషా పురస్కారాలను ఏటా అందజేస్తామని వెల్లడించారు. అలాగే సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, ఏడాదిలోనే నంది నాటకోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమరావు, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వరరావు రచించిన 'కావ్య మల్లికలు' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు.




# రక్తదానం.. ప్రాణదానంతో సమానం

**● రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం**

**జమ్మలమడుగు మన జనప్రగతి ఆగస్టు 29:-** సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి 151వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఏక్తా దివస్2026 కార్యక్రమాల్లో భాగంగా, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు, జమ్మలమడుగు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వెంకటేశ్వరరావు, డి.ఎస్.పి. పర్యవేక్షణలో జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.సమాజంలో ఐక్యత, సేవాభావం, మానవతా విలువలను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తదానం అనేది ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అత్యున్నత మానవతా సేవ అని, ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక ఎస్పీ డిగ్రీ కళాశాల విద్యార్థులు, బంగారు దుకాణాల యజమానుల సంఘం సభ్యులు, ఆటో డ్రైవర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ప్రజా సేవతో పాటు సామాజిక బాధ్యతను చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం రాష్ట్రీయ ఏక్తా దివస్ స్ఫూర్తిని ప్రతిబింబించిందని నిర్వాహకులు తెలిపారు. రక్తదాతలందరికీ పోలీసు అధికారులు అభినందనలు తెలియజేసి, ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.





# పెద్ద రంగాపురంలో పోలీసుల ముఖాముఖి

**- నేరాల నివారణపై అవగాహన**

**పులివెందుల టౌన్ మన జనప్రగతి ఆగస్టు 29:-** వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో పులివెందుల అర్బన్ సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పెద్ద రంగాపురం గ్రామాన్ని సందర్శించి ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు సైబర్ నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, క్రికెట్ బెట్టింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.గుర్తుతెలియని ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు సూచించారు. ఇళ్లలో విలువైన వస్తువులు, నగదు, బంగారు ఆభరణాల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, క్రికెట్ బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమని పోలీసులు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174